క్లుప్తంగా

శింగరకొండ దర్శిని



అద్దంకి: క్రోధి నామ సంవత్సరం ఉత్తరాయనం జ్యేష్టమాసం భరణి నక్షత్రం చతుర్థి తిథి సందర్భంగా గురువారం శింగరకొండ ఆలయంలో ప్రసన్నాంజనేయస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు దేవస్థాన ఏసీ సుభద్ర తెలిపారు ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1 నుంచి 1.30 గంటల వరకు పంచహారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 నుంచి 7.45 గంటల వరకు ప్రదోషకాలార్చన అనంతరం ఆలయాన్ని మూసివేస్తారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అద్దంకి రూరల్: పట్టణంలో కొత్త పరివర్తకాలు, కొత్త విద్యుత్ స్తంభాలు, 3 ఫేజ్ లైన్లు లాగడం వంటి పనులు జరుగుతున్నందున స్థానిక చినగానుగపాలెం పరిసర ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

6వ తేదీలోపు సర్టిఫికెట్లు అందజేయాలి

దర్శి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో పరీక్షలు రాసి అర్హత పొందిన విద్యార్థులు ఈ నెల 6వ తేదీ లోపు ఒరిజినల్ సర్టిఫికెట్‌లు అందజేయాలని ప్రిన్సిపాల్ ఎస్.మాధవరావు తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అలా ఇవ్వని వారి పేర్లు రద్దు చేసి వారి స్థానంలో వెయిటింగ్ లిస్టులో ఉన్న వారికి ప్రవేశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

8 నుంచి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్

పెద్దదోర్నాల: వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 8 నుంచి మండల పరిధిలోని కడపరాజుపల్లెలో మెగా టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు గోనుగుంట్ల పోల్‌రాజు, వట్టి నాగార్జునరెడ్డి తెలిపారు. మండల సచివాలయ కన్వీనర్ గుండారెడ్డి రమణారెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఈ టోర్నమెంట్‌లో ప్రతి మ్యాచ్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు ఉంటుందన్నారు. మ్యాచ్‌లో విజయం సాధించిన జట్టుకు మొదటి బహుమతిగా 30 వేల రూపాయలు, రెండో బహుమతిగా 20 వేల రూపాయలు, మూడో బహుమతిగా 10 వేల రూపాయలు అందించనున్నట్లు చెప్పారు. మ్యాచ్‌ల నిర్వహణకు గుంటూరు ఆంజనేయరెడ్డి సోదరులు గ్రౌండ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాల కోసం 62810 85099, 72868 64400 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి సదరమ్ స్లాట్ బుకింగ్

కురిచేడు: వికలాంగులకు వైకల్య ధ్రువీకరణ పత్రాల కోసం నిర్వహించే సదరమ్ స్లాట్ బుకింగ్ శిబిరాలు గురువారం నుంచి ప్రారంభం అవుతున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసిందని వైద్యాధికారి పి.ప్రవీణ్ తెలిపారు. వైకల్యం కలిగిన వారు, పిల్లలకు వైకల్యం కలిగిన వారు వైకల్య నిర్ధారణ పరీక్షల కోసం గ్రామ, వార్డు సచివాలయాలు, మీ సేవా కేంద్రాల్లో ముందస్తు స్లాట్లను బుక్ చేసుకోవాల్సి ఉంది. స్లాట్ ప్రకారం నిర్ణయించిన జిల్లా వైద్యశాలలో సంబంధిత వైద్యుని వద్ద పరీక్షలు నిర్వహించి వైకల ధ్రువీకరణ పత్రం మంజూరు చేస్తారు. ఆ పత్రం ఆధారంగా చదువులో, ఉద్యోగంలో రిజర్వేషన్లు, బస్సు పాస్‌లు మంజూరు, పింఛన్ల మంజూరుకు కూడా సదరమ్ సర్టిఫికెట్లు ఉపయోగపడతాయని, కావాల్సిన వారు స్లాట్లు బుక్ చేసుకోవాలని డాక్టర్ ప్రవీణ్ తెలిపారు.

నిల్వ స్టాక్‌ను అప్‌లోడ్ చేసుకోవాలి

దర్శి: మండలంలో ఉన్న విత్తనాలు షాపుల్లో నిల్వలను వెంటనే అప్‌లోడ్ చేసుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు కె.బాలాజీ నాయక్ ఆదేశించారు. మండలంలోని ఎరువులు, విత్తనాలు దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్‌లు, బిల్ బుక్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా బాలాజీ నాయక్ మాట్లాడుతూ తమ తమ షాపుల్లో ఉన్న నిల్వలను స్టాక్ బోర్డుల్లో ఉంచాలని సూచించారు. రైతులకు విత్తనాలు అమ్మినప్పుడు వారికి తప్పని సరిగా బిల్ ఇవ్వాలని ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ వస్తున్నందున రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు తప్పని సరిగా బిల్లులు అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఎవరైనా బిల్లులు ఇవ్వకుంటే తమ దృష్టికి తీసుకొస్తే అటువంటి షాపుల లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు కార్యక్రమంలో ఏఓ బాలకృష్ణనాయక్ పాల్గొన్నారు.



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

ముక్తేశ్వరంలో మంచినీటికి కటకట

బల్లికురవ:

వర్షాభావ పరిస్థితులతో బావులు, బోర్లలో భూగర్భజలం అడుగంటడంతో మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో ప్రజలు మంచినీటికి 20 రోజులుగా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో సుమారు 2 వేలపైగా జనాభా ఉన్నారు. గ్రామంలోని బోర్లు, బావుల్లో నీరు వాడుకోవటానికి మినహా తాగేందుకు అనుకూలంగా లేదు. ప్రాథమికోన్నత పాఠశాలకు ఉత్తర భాగంలో ఎంతో చరిత్ర కలిగిన మహల్‌బావి నుంచి మోటారు, పైపులైన్ ద్వారా కుళాయిలు ఏర్పాటు చేశారు. అయితే, వర్షాలు లేనందున గతేడాది సాగర్ కాలువకు నీటి విడుదల లేనందున ఈ మహల్ బావిలో నీరు అడుగంటింది. గతంలో గంటల తరబడి మోటారు ఆఫ్ చేసినా నీటికి ఢోకా లేదు. ప్రస్తుతం రోజులో పది నిమిషాలకు మించి మోటారు ఆడే పరిస్థితి లేదు ఇళ్లలో ఏర్పాటు చేసిన బోర్లలో కూడా నీరు రావడం లేదని ప్రజలు తెలిపారు. గ్రామంలోని ఆర్వో ప్లాంట్ వద్ద నుంచి వృథా నీటిని ఇంటింటికి మోసుకెళ్తున్నారు. తాగు నీటికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ట్యాంకర్ల ద్వారానైనా మంచినీటిని అందించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.



ముక్తేశ్వరంలో అడుగంటిన మహల్‌బావి

చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం



చిన్నారి కీర్తి తండ్రికి రూ.1.26 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్న రామానంద సరస్వతి

చీరాల టౌన్: ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న ఓ చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు వాడరేవు రామానంద సరస్వతి స్వామి. ఒక నిరుపేద ఇంటికి వెలుగులు నింపేందుకు రామానంద సరస్వతి స్వామి రూ.1.26 లక్షలు ఆర్థిక సాయాన్ని బుధవారం చిన్నారి తండ్రికి అందించారు. వివరాల్లోకి శితే.. పాపరాజుతోటకు చెందిన అచ్చుల శివశంకర్ ప్రైవేటు కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. అతని కుమార్తె కీర్తి భవనంపై ఆడుకుంటూ ప్రమాదవశాత్తు కింద పడి తలకు తీవ్ర గాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లింది. దీంతో కుటుంబ సభ్యులు పాపకు ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో విజయవాడలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పాప కీర్తి బతకాలంటే మెదడుకు ఆపరేషన్ చేయాలని, అందుకు రూ.14 లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. ప్రైవేటు కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసే శివశంకర్‌కు అంత డబ్బులు లేకపోవడంతో అందిన చోటల్లా అప్పులు చేశాడు.

తన ఆర్థిక పరిస్థితిని వాడరేవు రామానంద సరస్వతికి విన్నవించగా కీర్తి ఆపరేషన్ కోసం తమ ట్రస్ట్ తరఫున రూ.1.26 లక్షల ఆర్థిక సాయాన్ని అందించారు. తీవ్రంగా గాయపడిన పాప ఆరోగ్యంగా తిరిగి రావాలని స్వామీజీ ఆకాంక్షించారు. ఆయన వెంట మేనేజర్ ఎస్.సురేష్, తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు కనీస వసతులు కల్పించాలి



నిరసన తెలుపుతున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు

చీరాల అర్బన్: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచే పారిశుద్ధ్య కార్మికులకు కనీస వసతులు కల్పించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కోటి దాసు, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు అచ్చుతుని బాబూరావు అన్నారు. చీరాల మున్సిపల్ కార్యాలయ ఆవరణలో బుధవారం పారిశుద్ధ్య కార్మికులు కనీస వసతులు కల్పించాలని కోరుతూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలో చెత్త తరలించేందుకు ఏర్పాటు చేసిన వాహనాలను పారిశుద్ధ్య కార్మికుల చేత బాగు చేయిస్తున్నారని అన్నారు. అరకొర జీతాలు తీసుకునే పారిశుద్ధ్య కార్మికులతో వాహనాలు బాగుచేయించడమేమిటో అర్థం కావడం లేదన్నారు. మున్సిపల్ నిధులు ఏం చేస్తున్నారో తెలపాలన్నారు. నిరంతరం పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచే పారిశుద్ధ్య కార్మికులకు గ్లౌజులు, శానిటరీ వస్తువులను ఇవ్వడంలేదన్నారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

చీరాల ఏడీఏగా భాస్కరరావు బాధ్యతల స్వీకరణ



కట్టిబోయిన భాస్కరరావు

చీరాల టౌన్: చీరాల సహాయ వ్యవసాయ సంచాలకులుగా చినగంజాం మండల వ్యవసాయాధికారిగా పనిచేస్తున్న కట్టిబోయిన భాస్కరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏడీఏగా పనిచేస్తున్న బి.ఎఫ్రాయిమ్ ప్రకాశం జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయానికి బదిలీ అయ్యారు. దీంతో చీరాల ఏడీఏ కార్యాలయంలో పూర్తి అదనపు బాధ్యతలతో ఏడీఏగా భాస్కరరావును వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు నియమించడంతో విధుల్లో చేరారు. భాస్కరరావును సబ్‌డివిజన్ పరిధిలోని మండలాల వ్యవసాయాధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలోని రైతులకు అందుబాటులో ఉండటంతో పాటుగా ప్రభుత్వం అందించే ప్రతి పథకాన్ని అర్హులైన ప్రతీ రైతుకు అందించి వ్యవసాయశాఖ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి



వేమవరంలో చిన్నారిని పరీక్షించి మాట్లాడుతున్న వైద్యాధికారి

బల్లికురవ: వర్షాల సీజన్ ఆరంభమైనందున 5 సంవత్సరాల్లోపు చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి జీ రవితేజ కోరారు. మండలంలోని వేమవరం గ్రామంలో బుధవారం 104 ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుగర్, బీపీ, హిమోగ్లోబిన్ పరీక్షలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రభుత్వం డయేరియాను సమూలంగా నిర్మూలించేందుకు ఆగస్టు 31వ తేదీ వరకు అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చేతుల పరిశుభ్రతతో పాటు సురక్షిత మంచినీటి వాడకంపై అవగాహన కల్పించాలని వైద్యారోగ్యశాఖ సిబ్బందిని ఆదేశించారు. 5 సంవత్సరాల్లోపు చిన్నారులకు జింక్ మాత్రలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్నట్లు చెప్పారు. సాయంత్రం శిబిరానికి రాలేని వృద్ధులు, చిన్నారులను ఇంటింటికి వెళ్లి పరీక్షలు చేశారు.

అతిసార వ్యాధిని తరిమికొడదాం



స్వర్ణ పీహెచ్‌సీ వద్ద డయేరియాపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

స్వర్ణ (కారంచేడు): ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ప్రబలుతున్న అతిసార వ్యాధిని తరిమికొట్టేలా ప్రజల్లో పూర్తిస్థాయి అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్వర్ణ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షాలినీ అన్నారు. మండలంలోని స్వర్ణ పీహెచ్‌సీ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అతిసార వ్యాధిపై అవగాన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బందితో మాట్లాడుతూ అతిసార వ్యాధి అంటే ఏమిటి, దీనిని ఎలా నివారించుకోవాలో తెలియజేసారు. చిన్న బిడ్డలకు ఒక రోజులో మూడు సార్లు అంతకంటే ఎక్కువ సార్లు పలచగా విరేచనాలైతే దీనిని అతిసార వ్యాధి లక్షణంగా చూడాలన్నారు. దీని నుంచి ఉపశమనం పొందేందుకు ఓఆర్ఎస్, విటమిన్ ఏ సిరప్‌ను తాగించాలన్నారు. స్వచ్ఛమైన తాగునీటిని ఉపయోగించాలన్నారు. భోజనానిని ముందు, మరుగుదొడ్లు వినియోగించిన తరువాత తప్పకుండా చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. తల్లి పాలు తాగకపోవడం, ప్రతిదీ వాంతి చేసుకోవడం, పలుచని మల విసర్జన తరువాత నిర్జలీకరణ, అనారోగ్యానికి గురవడం, మలంలో రక్తం వంటి లక్షణాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. అతిసార వ్యాధిపై ప్రధానంగా లోతట్టు ప్రాంత ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఈ మీనాకుమారి, హెచ్‌వీ మాధురీ సిఫోరా, హెచ్ఈఓ నాగేశ్వరరావు, ఎంపీహెచ్ఈఓలు, ఏఎన్ఎంలు, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోతుకట్లలో స్టాప్ డయేరియాపై అవగాహన

చినగంజాం: పర్చూరు మండలంలోని పోతుకట్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం 52లో స్టాప్ డయేరియా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. డయేరియా రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో హ్యాండ్ వాష్ చేయించారు. కార్యక్రమంలో చెరుకూరు పీహెచ్‌సీ డాక్టర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్ఆర్, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.



పోతుకట్లలో శుభ్రం చేసుకున్న చేతులను చూపుతున్న అంగన్‌వాడీ పిల్లలు, తల్లులు, సిబ్బంది

ప్లాస్టిక్ రహిత సమాజానికి సహకరించాలి



జూట్ బ్యాగ్‌లు అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకి రూరల్: ప్లాస్టిక్ రహిత సమాజానికి ప్రతిఒక్కరూ సహకరించాలని అద్దంకి మున్సిపల్ కమిషనర్ ఎం.సత్యనారాయణ కోరారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రపంచ ప్లాస్టిక్ బ్యాగుల రహిత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై అధికారులు పదేపదే జీవోలు, సూచలనలు ఇస్తున్నారన్నారు. దానికి అనుగుణంగా ప్లాస్టిక్ నిషేధానికి వ్యాపారులు, ప్రజలు సహకరించాలన్నారు. అనంతరం రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య జూట్ బ్యాగ్‌లు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ చుండూరి మురళి, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ షేక్ మహమ్మద్ రఫీ, చిన్న మురళి, కావూరి రఘుచంద్, యు.దేవపాలన, పి.శ్రీరామచంద్రమూర్తి, నాగయ్య, భువనేశ్వరి, శ్రీనివాసరావు, రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కోటి కుంకుమార్చన



పూజలందుకుంటున్న అమ్మవారు

పొదిలి: స్థానిక శ్రావణి ఎస్టేట్‌లోని పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక కోటి కుంకుమార్చన పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని గాయత్రి మంత్రోచ్చారణ, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. ఉభయదాతలను ఆలయంలోకి మేళ తాళాలతో ఆహ్వానించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు దీవి శ్రీకాంత్ భట్టర్, ప్రధాన సలహాదారులు మురళీ కృష్ణమాచార్యులు, నిర్వాహకులు యక్కలి శేషగిరి రావు, ఎస్.నాగేశ్వరరావు, పెరుమాళ్ల భాస్కర్, పొనుగుపాటి కోటేశ్వరరావు, సాయి తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళలకు సహకారం మానవతా ధర్మం

- 180 మంది పేద మహిళలకు దుస్తులు పంపిణీ



దుస్తులు అందుకున్న మహిళలతో సంస్థ ప్రతినిధులు

వేటపాలెం: పేదలకు సహాయ సహకారాలు అందించడం మానవతా ధర్మమని మార్పు సేవా సంస్థ ప్రతినిధి మార్పు గ్రెగోరి పేర్కొన్నారు. మండల పరిధిలోని రామన్నపేట లెప్రసీ కాలనీ, అక్కాయిపాలెం, సిలోన్ కాలనీ, సర్వోదయ కాలనీల్లో మార్పు సంస్థ ఆధ్వర్యంలో 180 మంది పేద మహిళలకు ఉచితంగా దుస్తులు బుధవారం పంపిణీ చేశారు. మనం చేసే సహాయం చిన్నదైనా, పెద్దదైనా అది చేసే వారి మనసు గొప్పతనం అని ఫాదర్ సురేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫాదర్ కరుణాకర్, మార్పు నరేష్, సీఏ లాజర్, విశ్రాంత ప్రిన్సిపాల్ మార్పు విన్సెంట్ పాల్, బాపట్ల రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు చేగూడి సురేష్, జోతుల ప్రకాష్, దేవరపల్లి దిలీప్, మార్పు సంస్థ కో ఆర్డినేటర్ చేగూడి జాన్సన్, పార నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

డీఈఈగా షియా నాయక్

కంభం: విద్యుత్ శాఖ సబ్ డివిజన్ ఇంజినీర్‌గా ఎస్. షియా నాయక్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న బాలఅంకయ్య ఉద్యోగ విరమణ పొందిన నేపథ్యంలో మార్కాపురం సబ్ డివిజన్ డిప్యూటీ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్న షియా నాయక్‌కు కంభానికి అదనపు బాధ్యతలు అప్పగించారు.

కనకనాగవరపమ్మ భూముల కౌలు ఆదాయం రెట్టింపు



కనక నాగవరమ్మ అమ్మవారి మూలవిరాట్

వేటపాలెం: రామన్నపేట శివారు పంట పొలాల్లో వేంచేసియున్న కనక నాగ వరపమ్మ అమ్మవారికి చెందిన సాగు భూములు కౌలు ఆదాయం ఈ ఏడాది రెట్టింపుగా నమోదైనట్లు దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ తెలిపారు. బుధవారం సంతరావూరు గ్రామంలో కనక నాగవరపమ్మకు చెందిన 26.13 ఎకరాల పంట భూములు ఈ ఏడాదికి కౌలుకు సాగు చేసుకోవడానికి వేలం పాటలు నిర్వహించారు. ఈ పాటల్లో గత ఏడాదికంటే రెట్టింపు ధరలతో అమ్మవారికి ఆదాయం చేకూరింది. గత ఏడాది కౌలు వేలం పాట ద్వారా రూ.5.93 లక్షల ఆదాయం సమకూరగా, ఈ ఏడాది రైతులు పోటీపడి పాటలో పాల్గొనడంతో రూ.10.59 లక్షలు ఆదాయం లభించింది. అమ్మవారికి కొడవలవారిపాలెం గ్రామ పరిధిలో 26.13 ఎకరాల పంట భూములున్నాయి. ఈ భూములను వేలం పాటల ద్వారా రైతులకు కౌలుకు ఇస్తుంటారు. కార్యక్రమంలో కే ఫణిరాజ్, బీ శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మెకానిక్ డే

దర్శి: ప్రపంచ మెకానిక్ డే సందర్భంగా దర్శిలో మెకానిక్ డేను ఫ్రెండ్స్ మోటారు సైకిల్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మెకానిక్ యూనియన్ కార్యాలయం నుంచి టూ వీలర్ మెకానిక్‌లు ర్యాలీ నిర్వహించి జెండా వందనం చేశారు. ప్రెసిడెంట్ దర్బార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు అరెగెల దశరథ, ఎస్‌కే రసూల్, ఆర్.సుభానీ, వీరయ్య, షేక్ ఖాశీం, వలి, వైస్ ప్రెసిడెంట్ అమరేశ్వరరావు, సెక్రటరీ జి.రమేష్, ట్రెజరీ కె.ఆదినారాయణ, జాయింట్ సెక్రటరీ ఎస్.బుజ్జి, మెంబర్లు పి.చిరంజీవి, షేక్ మహబూబ్ బాషా, కె.వెంకట నాగేశ్వరరావు, జి.నరసింహారెడ్డి, షేక్ బాజీ, పి.పిరుబాషా, షేక్ గులాం, మెకానిక్ సోదరులు పాల్గొన్నారు.



మెకానిక్ డే వేడుకల్లో పాల్గొన్న మోటారుసైకిల్ యూనియన్ నాయకులు

పిల్లలను బడికి పంపండి

త్రిపురాంతకం: బడి ఈడు పిల్లలందరినీ విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు పాఠశాలలకు పంపించాలని ఎంఈఓ కె.తులసి మల్లికార్జున నాయక్ పేర్కొన్నారు. మండలంలోని గొల్లవాండ్లపల్లిలో నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా గ్రామంలో విద్యార్థులను పాఠశాలలకు పంపాలని ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠశాలలకు రాని విద్యార్థులందరినీ గుర్తించి పాఠశాలల్లో చేర్చారు. విద్యార్థుల డ్రాపౌట్స్ తగ్గించాలని సూచించారు. పాఠశాలల విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరచాలని మల్లికార్జున నాయక్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీహరి, సీఆర్పీ శ్యామ్‌రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. రాజుపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ రాజశేఖరరెడ్డి పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి పరిచి విద్యాభివృద్ధికి ప్రభుత్వం పాటు పడుతుందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల సామర్థ్యాలను మెరుగు పరిచేందుకు పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పద్మ, శైలజ, సీఆర్పీ చాంద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

కంభం: అనుమతులు లేని కంపెనీల విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మార్కాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు డి.బాలాజీనాయక్ హెచ్చరించారు. ఒంగోలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.రామ్మోహన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓ దుకాణంలో సరైన అనుమతి పత్రం లేకుండా నిల్వలు ఉండటం గుర్తించి ఎస్ఆర్ఐ, అన్నపూర్ణ కంపెనీకి చెందిన 1390 కేజీల విత్తనాల అమ్మకాలు నిలిపివేసారు. వాటి విలువ రూ.62 వేలు ఉన్నట్లు తెలిపారు. నకిలీ విత్తనాలు విక్రయించినా, సరైన ధృవీకరణ పత్రాలు లేని విత్తనాలు విక్రయించినా చర్యలు తప్పవన్నారు. మండల వ్యవసాయాధికారి డి.స్వరూప పాల్గొన్నారు.